కథ

వారపత్రికలో ఏదో శీర్షిక చదువుతున్నదల్లా, టీవీ చూస్తున్న నన్ను చూసి, హఠాత్తుగా ప్రశ్నించింది నా శ్రీమతి. ''అంబాసడర్ అంటే తెల్సు! బ్రాండ్ అంబాసడర్ అంటే ఏమిటండీ?'' అని చెప్పొద్దూ! నాకొక్కసారి ఆనందం కలిగింది! ఇన్నాళ్లకి నాకు మాట్లాడే అవకాశం కలిగినందుకు. ''బ్రాండ్ అంబాసడర్ అంటే టీవీల్లో, సిన్మాల్లో యాడ్స్‌లో కన్పిస్తుంటారే చూడూ! వాళ్లూ!! అన్నాను. ''యాడ్స్‌లో చాలామంది కన్పిస్తుంటారు! వాళ్లందరూనా!'' అనడిగింది, అర్థంకానట్లు. ''అబ్బే! వాళ్లందరూ కాదు! యాడ్‌లో ఉండే ప్రముఖ హీరోనో, క్రికెటరో అన్నమాట!''

# బ్రాండ్ అంబాసడర్

– పి.వి. రామశర్మ

''అంత తీరుబడిగా టీవీని యాడ్స్‌తో సహా ఎక్కడ చూసి చచ్చాను గనుక! మీలాగా!?'' అని ఓ చెణుకు విసిరింది.

అమ్మో! గాలి నా మీదకి మళ్లేలా ఉందనుకుని కంగారుపడి,

''అబ్బెబ్బే!! అలాక్కాదు! ఉదాహరణకి చిరంజీవి థంప్సప్ యాడ్‌లో ఉంటాడు చూడు! అలాగ!!'' అని సోదాహరణంగా వివరించాను.

''ఇప్పుడు చిరంజీవి ఎక్కడ ఉన్నాడు థంప్సప్ యాడ్‌లో? మహేష్ బాబు కదా!'' అని ప్రశ్నించింది ఠక్కున.

''ఇప్పుడే కదే! యాడ్స్ చూసే తీరుబడి ఎక్కడిదన్నావు? ఇప్పుడేమో మహేష్ బాబు థంప్సప్ యాడ్‌లో ఉన్నాడంటున్నావు!'' దొరికావు దొంగా అన్నట్లు నిలదీసాను.

''బావుంది! ఏదో వంటింట్లో పన్జేసుకుంటూ, మధ్యమధ్యలో ఎప్పుడో టీవీ చూస్తుంటే కనబడి ఉంటాడు. ఆ మాత్రం దానికి నన్ను క్రాస్ ఎగ్జామిన్ చెయ్యక్కర్లా!'' తిప్పికొట్టింది భార్యామణి.

''సరే! సరే! నువ్వు టీవీ తక్కువగానే చూస్తూంటావు! ఒప్పుకున్నా! ఇప్పుడు నీకర్థమైంది కదా! మహేష్ బాబు థంప్సప్‌కి బ్రాండ్ అంబాసడర్ అనీ! అలాగే అమితాబ్ బచ్చన్ చాలా వాటికి... ప్రస్తుతం క్యాడ్ బరీస్ డైరీ మిల్క్ కీ, అభిషేక్ బచ్చన్ ఐడియా సెల్‌కీ, షారుక్‌ఖాన్ డిష్ టీవీ ఏంటెన్నాకీ, ఎయిర్‌టెల్‌కీ, బ్రాండ్స్ అన్నమాట!'' చాలా విషయాలు నాకు తెల్సు!.. అన్నట్టు పోజిచ్చాను.

''ఓహో! టీవీ ప్రోగ్రాంల మీదే కాదు యాడ్స్ మీద కూడా చాలా పరిజ్ఞానం సంపాదించారు!'' అని ఓ ప్రశంసలాంటిది వదిలింది మా ఆవిడ.

అది పొగడ్తో, తెగడ్తో అని అనుమానం వచ్చినా, ప్రస్తుతానికి పొగడ్తగానే తీసుకుందాం... అనుకుని ఇంకా రెచ్చిపోయా!

''ఇంతే అనుకున్నావా? ఇంకా విను! మన హీరోయిన్లలో స్నేహ ఉందా!... ఆవిడేమో సి.యమ్.ఆర్ షాపంగ్ మాల్‌కీ, ఛార్మి ఉందా... బిగ్–సి షాపింగ్ సెంటర్‌కీ, త్రిష ఏమో టాటా ఇండికామ్ సెల్‌ఫోన్‌కీ, ప్రీతిజింటా ఉందా... ఆవిడ బిఎస్ఎన్ఎల్ ఫోన్లకీ బ్రాండ్ అంబాసిడర్స్ అన్నమాట!!... వీళ్లందర్నీ చూడగానే.. ఆయా ప్రోడక్ట్స్ అన్నీ గుర్తుకొచ్చేయాలన్న మాట!'' కాసేపు ఊపిరి పీల్చుకుంటానికి ఆగాను.

''ఆహాఁ!... ఆడవాళ్లని కూడా బాగానే గుర్తుపెట్టుకున్నారు!... ఇంటి విషయాలు కూడా

ఇలా గుర్తుంటాయా? మన రెండోవాడు ఇప్పుడే సంవత్సరం చదువులో ఉన్నాడో తక్కున చెప్పండి?! ''టీవీ రిపోర్టరు ప్రశ్నలాగా చాలా వేడిగా, వాడిగా వదిలింది.

''అబ్బా! అలా తీసిపారేయకు! ఏదో! ఇన్నాళ్లకి నువ్వేదో అడిగావు. నాకు తెలిసింది చెప్పాను! అయినా వీళ్ళందర్నీ గుర్తెట్టుకుందుకు టీవీయే చూడక్కరలేదు. ఏ రోడ్డు మీద, ఏ జంక్షన్‌లో చూసినా వీళ్ల కటౌట్లు, హోర్డింగులూనూ!'' అన్నాను.

''ఏమోలెండి! నేను రోడ్డమ్మట వెళ్తే, మీలా దిక్కులు చూసే అలవాటులేదు. మీరిలా బోర్డులు, బేనర్లూ చూస్తూ వెళ్తారన్నమాట!.. అన్నట్టు గుర్తొచ్చింది! మొన్నీ మధ్య మీరు స్కూటర్ మీంచి పడి చిన్న చిన్న దెబ్బలు తగిలించుకున్నారూ! వాడెవడో అడ్డంగా వచ్చాడు, పడ్డానని చెప్పారు! కొంపదీసి వీళ్లందర్నీ చూస్తూ... స్కూటరు మీంచి పడలేదుకదా!'' కొత్త పోస్ట్‌మార్టం మొదలెట్టింది మా ఆవిడ!

''ఏమోయ్! ఇవాళ నువ్వు నాకు మేగీ చేసి పెడతానని మాటిచ్చావు! దాని బదులు, నా మెదడుని వేగీలా చేసి నువ్వే తినేటట్లున్నావు!.. ఎందుకిలా నా మీద ఇంత పగనీకు!'' ఉడుక్కున్నానో, ఉద్రేకపడ్డానో నాకే తెలీలేదు!

''అబ్బ! అలా ఉడుక్కోకండీ! సరదాకన్నాను!! నిజంగానే నాకు 'బ్రాండ్ అంబాసడర్' అంటే తెలీకే అడిగాను. కాని మీరు చెప్తూంటే చాలా బాగా అర్థమైపోయిందంటే నమ్మండీ!'' కొంత రాజీకొచ్చిందావిడ.

సర్లే! తనోమెట్టు దిగొచ్చినపుడు, నేనో రెండుమెట్లు దిగితే ఏం పోయిందిలే...అనుకుని...

''థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్! మళ్లీ నన్నేం అననంటే ఇంకొందరు బ్రాండ్స్ గురించి చెప్తాను'' అన్నాను... అదేదో నా ఒక్కడికే తెల్సిన దేవ రహస్యమైనట్లు!

''పనిగట్టుకుని నేనెందుకంటానండీ! మీరే మీ పిలక అప్పుడప్పుడు నా చేతి కందించేస్తుంటారు! సరే! చెప్పండి! చెప్పండి!!'' విమర్శనాత్మక ఒప్పందానికి వచ్చింది తను.

''యాడ్స్‌లో బ్రాండ్ అంబాసిడర్స్‌గా ఎలా ఉంటారో, నిజజీవితంలో కూడా కొంతమంది కొన్నింటికి బ్రాండ్స్‌గా ఉంటారు తెల్సా!'' అన్నాను

''వాళ్లెవరండీ?'' అనడిగింది కుతూహలంగా!

''మన రాజకీయ నాయకులున్నారా? వాళ్లు కబ్జాలకీ, కుంభకోణాలకీ, కోట్లాది రూపాయలు దిగమింగడానికీ బ్రాండ్ అన్నమాట. ఎక్కడన్నా ఫలానా నాయకుడు కనిపిస్తే... వెంటనే అతడు కబ్జా చేసిన గ్రామాలు, పొలాలు, ఇళ్లస్థలాలు గుర్తుకువస్తాయి.


అలానే కొందరు సిన్మాయాక్టర్లు తరచూ విడాకులకీ, రెండో పెళ్లి చేసుకోకుండా ఇంకో అమ్మాయితో కాపురం చెయ్యడానికీ, లేకపోతే ఇంతకు మునుపే పెళ్లైపిల్లలున్న హీరోలని పెళ్లి చేసుకోవడానికీ, ఇవేవీ కాకపోతే... ఓ హీరో తన పెళ్లాన్నొదిలేసి, ఓ హీరోయిన్ తన మొగుణ్ణి వదిలేసి, వాళ్లిద్దరూ ఓ యింట్లో సెటిలై పోవడానికీ... ఇలా ఒక్కొక్కరు ఒక్కో విషయానికి బ్రాండ్ అన్నమాట.'' గొప్పశోధన చేసాను సుమా అన్నట్టు చెప్పాను.

''బావుంది! బ్రాండ్ అంబాసడర్ అంటే ఏమిటండీ? అనడినందుకు బాగానే చెప్పారూ! ఇప్పుడు నాకు పూర్తిగా అర్థమైంది! నాకు అర్థమైన దానికీ!...''పరమ బద్ధకిష్టి'' అన్న పదానికి బ్రాండ్ అంబాసడర్ మీరు!''

భారీ (భార్య) ఎత్తున తిరుగుబాటు చేసి, తీర్పు చెప్పిన జడ్జీలా చూసిందావిడ.

''ఇదన్యాయం! మధ్యలో నన్నాడిపోసు కుంటావేం!? ఆఫీసులో చాకిరి చేసి చేసి, అలసిపోయి ఇంటికొచ్చి, కాస్త రెస్టు తీసుకుంటే నన్ను 'పరమ బద్ధకిష్టి' అంటావా? ఆయ్!?'' అని గయ్ మన్నాను. నాకు తెలుసు! ప్రతిసారీ ఏదో ఒకటి చేసి నన్నేదో అనందే దీనికి తోచదు.

''చాల్లెండి! మీ ఆఫీసు అలసటా మీరూనూ!



దాన్నిబట్టి, మీరు కూడా ఓ బ్రాండ్ అంబాసిడరే! అదిమీకు తెల్సో! లేదో!!..'' ప్రశంసిస్తూనే, మళ్లీ ఏదో మడతపేచీ పెట్టింది భార్యామణి.

''ఎక్కడేం జరిగినా టీవీవాళ్లు అవునో, కాదో అని ఎస్ఎమ్ఎస్ పంపుతున్నట్లు, మళ్లీ నామీద పడ్డావేమే? మధ్యలో నేను దేనికి బ్రాండ్ అంబాసడర్ని?'' ఈ సారి ఊరుకోదల్చుకోలేదు! లేపోతే రా(న్రానూ దీని ఆగడాలు మితిమీరిపోతున్నాయి!

''మీరా! మీది చాలా మంచి బ్రాండ్! సాయంత్రం ఆఫీసు నుండి రాగానే, సోఫాలో అడ్డం పడి, కాఫీ, టిఫిన్‌తో సహా సోఫాలోనే కానిచ్చి, భోజనం టైం దాకా, అలా టీవీకి అతుక్కుపోయి, పిల్లల గురించి, నా గురించి ఏం పట్టించుకోకుండా, తొమ్మిదిగంటలవగానే భోజనం కానిచ్చి, గురక పెట్టిపడుక్కుంటారే?!... మా సోమలింగం అన్నయ్యది మీ ప్రక్క సెక్షనేనటగా. మీ గురించి చెప్తూనే ఉంటాడు– ''చాలా సుఖ పురుషుడమ్మా మీ ఆయన! ఆఫీసులో ఆయన సీటులో చాలా ప్రశాంతంగా ఆనందంగా కూర్చుంటాడు. దేనికీ చలించాడు. పని గురించీ, ఫైళ్ల గురించీ వీడి క్రింద వాళ్లకీ, పైవాళ్లకీ టెన్షన్ ఉంటుంది గానీ, వీడు మాత్రం ఏ టెన్షన్‌పడడు. ఎందరికోగానీ రాదటాంటి అదృష్టం!...'' అని కడిగేసింది మా ఆవిడ.

''అమ్మ! సోమా! నా గురించి ఇంత ప్రచారం (నిజాలైనా సరే!) చేస్తావా! అదీ మా ఆవిడ ముందర! చెప్తానీ పని!!'' అని పళ్ళునూరు కున్నాను! అంతకంటే ఇంకేం చెయ్యగలనూ!!... ఇంట్లో!!..

*